క్లుప్తంగా

విద్యుత్ ఏఈగా నటరాజ్ బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం: మండల విద్యుత్ శాఖాధికారి అధికారిగా జవ్వాజీ నటరాజ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నరసరావుపేట డివిజన్ డీఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై శావల్యాపురం వచ్చారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఏఈ సంపెంగుల గాంధీ ఈపూరు మండలానికి బదిలీపై వెళ్లారు.

ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు తగదు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు సమావేశంలో వలంటీర్లు పాల్గొన్నారని ఎల్లో మీడియా అసత్య ప్రచారాలపై గ్రామ సర్పంచ్ చింతా విజయ్‌కుమార్ (అంకమ్మ) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన శనివారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మాట్లాడారు. గ్రామంలోని ఏడుగురు వలంటీర్లు ఈనెల 19న స్వచ్ఛందంగా రిజైన్ చేసి ఈనెల 20న జరిగిన వైఎస్సార్ సీపీ మండల నాయకుల సమావేశంలో పాల్గొన్నట్లు చెప్పారు. విషయం తెలుసుకోకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ఇష్టానుసారంగా ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేయడం దుర్మార్గమని ఖండించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో సంక్రాంతి పండుగ రోజున చీరలు పంపిణీకి గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు హాజరు కాలేదని అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి వెంకట్రావు, బోడాల వీరాంజనేయులు, అల్లూరి వెంకయ్య, తోట రవి, ఏడుకొండలు పాల్గొన్నారు.

సాతులూరు చోరీపై దర్యాప్తు వేగవంతం

నాదెండ్ల: పట్టపగలే సాతులూరులో జరిగిన భారీ చోరీపై పల్నాడు జిల్లా క్రైం పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఇప్పటికే క్రైం స్క్వాడ్ పోలీసులు వేలిముద్రలు, సాక్ష్యాలను సేకరించారు. ఆగంతకులు సుమారు 457 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు చోరీ చేసిన సంగతి తెలిసిందే. మార్కెట్లో వీటి విలువ రూ.27 లక్షల వరకూ ఉంటుంది.

జ్యూస్, తినుబండారాల దుకాణాల తనిఖీ

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో పల్నాడు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సీహెచ్. లక్ష్మీనారాయణ శనివారం పర్యటించారు. గ్రామంలోని జ్యూస్, తినుబండారాల షాపులను ఆయన తనిఖీ చేశారు. ఆహార పదార్థాల తయారీలో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. ఆహార పదార్థాలు, జ్యూస్ తయారీలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, రసాయనాలను ఉపయోగించరాదని సూచించారు. దుకాణ నిర్వాహకులంతా విధిగా లైసెన్స్‌లు తీసుకోవాలని, గడువులు ముగిస్తే రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు.

ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి

సత్తెనపల్లి సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి



సత్తెనపల్లి: క్షణికావేశంలో చేసిన తప్పులు గమనించి ముద్దాయిలు సత్ ప్రవర్తనతో మెలగాలని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) డి.నాగ వెంకటలక్ష్మి అన్నారు. పట్టణంలోని సబ్ జైల్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. న్యాయ వాదులను నియమించికొనే ఆర్థిక స్తోమత లేని ముద్దాయిలకు ప్రభుత్వ న్యాయ సహాయ న్యాయవాదిని న్యాయస్థానమే నియమిస్తుందన్నారు. ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చునన్నారు. సబ్ జైల్లోని వంటశాలను పరిశీలించారు. అక్కడ పరిసరాలను, పదార్థాలను పరిశీలించి ముద్దాయిలతో మాట్లాడారు. ఆమె వెంట సీనియర్ న్యాయవాది బి.ఎల్. కోటేశ్వరరావు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంపునకు చర్యలు

శావల్యాపురం: రానున్న రోజుల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంపుదలకు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఏపీడీ ఈపూరి బుసిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 19 లక్షల 70 వేల పని దినాలకు గానూ ఇప్పటి వరకు 19 లక్షల 50 వేలు కల్పించినట్లు చెప్పారు. కూలీల వేతనాలు ఆరు వారాలు పాటు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతానికి నియోజకవర్గంలో ఐదు వేల మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. పంట కాల్వలు, చెరువుల్లో పూడిక తీత పనులు మాత్రమే చేస్తున్నట్లు ఏపీడీ చెప్పారు. రానున్న మూడు నెలల్లో కూలీల సంఖ్య పెంపుదల జరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. నీటి కుంటల పురోగతి చాలా తక్కువగా ఉందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ఏకైక సీఎం జగన్

- ఒకటో వార్డు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- జనసేన అభిమానులు ఆలోచించి ఓటు వేయాలి
- డ్వాక్రా మహిళలకు న్యాయం చేసిన సీఎం జగన్
- మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు



డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన కేకను కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర రాజకీయాల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం పట్టణంలోని ఒకటో వార్డు సాయినగర్‌లో పర్యటించారు. నాయకులు, కార్యకర్తలు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ కరపత్రాన్ని అందజేశారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని డ్వాక్రా మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వారు ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి మాట్లాడారు. ఈ వార్డులో డ్వాక్రా గ్రూపుల్లో అధికంగా మహిళలు ఉన్నారన్నారు. ఈ వార్డులో 687మందికి అమ్మఒడి, 136మందికి జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన 298, పింఛన్లు 786, చేయూత 299, జగనన్న ఇళ్లపట్టాలు 318మందికి ఇచ్చినట్లు వివరించారు. ఇళ్ల ట్టాలు రానివారికి రెండో జీలో ఇస్తున్నామని తెలిపారు. నాడు డ్వాక్రా మహిళలకు చంద్రబాబు మోసం చేస్తే.. సీఎం జగన్ రుణమాఫీ చేస్తానని చెప్పి రూ.26వేలకోట్లు ఇచ్చారని చెప్పారు. కరోనా కష్టకాలంలో సైతం ఇచ్చిన మాట ప్రకారం అన్నీ సంక్షేమ పథకాలు పూర్తి చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల అనంతరం అందరికీ మళ్లీ పథకాలు, ఇళ్ల పట్టాలు అందజేస్తారన్నారు. అందరూ గుర్తు పెట్టుకొని సీఎం జగన్‌తో పాటు తనను బలపర్చాలని కోరారు. పవన్ కల్యాణ్‌కు సీఎంకు పదవి ఇస్తే ఆయన అభిమానులు ఓటు వేయవచ్చని, కానీ అతడికేమి ఇవ్వకుండా 24 సీట్లకు 21 ఇచ్చి చంద్రబాబు మోసం చేశాడని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతు తెలియజేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, కనీస వేతన అమలు బోర్డు జిల్లా సభ్యుడు రామిశెట్టి కొండలరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి ఎస్కే ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు యర్రంశెట్టి రాము, బాబ్జి, షేక్ రెహమాన్, సయ్యద్ బాబ్జీ, వార్డు నాయకులు బండి వాసంతి, షేక్ బారీ, మక్కెళ్ల మల్లికార్జునరావు, చీమకుర్తి శేఖర్, షేక్ గౌస్, ఆర్.వెంకటేష్, దాసరి శ్రీనివాసరావు, రామిరెడ్డి, గోల్డ్ మస్తాన్, నాగేశ్వరరావు, అచ్చయ్య, హాలీవుడ్ రఘు, వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ పాతిమా, ద్వారక, మల్లెల అనీల పాల్గొన్నారు.

ముస్లింలకు ప్రాధాన్యం కల్పించిన జగనన్న

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కావటి మనోహర్‌నాయుడు,నేతలు

చిలకలూరిపేట: జగనన్న ప్రభుత్వం ముస్లింలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సయ్యద్ బషీర్ మేస్త్రి కార్యాలయంలో ముస్లిం పెద్దలతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌నాయుడు మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్‌తో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో ముస్లింల అభ్యున్నతికి పాటుపడ్డారని గుర్తు చేశారు. తండ్రి చూపిన మార్గంలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పిస్తున్నారని వెల్లడించారు. 2019 ఎన్నికల్లో ఐదుగురికి ఎమ్మెల్యే టికెట్లు కేటాయించారన్నారు. అందులో ఒకరు ఓడిపోతే ఆయనకు కూడా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకరికి ఉప ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారని చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో ఏడుగురు ముస్లింలకు ఎమ్మెల్యేలుగా పోటీచేసే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అదే చంద్రబాబునాయుడు విషయానికి వస్తే 2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకొని ముస్లింలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించకపోగా, కనీసం ఎన్నికల సమీపించే వరకు ముస్లిం మైనార్టీ మంత్రిత్వశాఖను కూడా ముస్లింలకు కేటాయించలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవులతో పాటు మున్సిపల్ చైర్మన్లుగా, మేయర్లుగా ముస్లింలకు సముచిత ప్రాధాన్యత కల్పించారని వెల్లడించారు.

ప్రతి సందర్భంలోనూ ఆయన నా మైనార్టీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ సంబంధిత వర్గాలపై మనసులో ఉన్న ప్రేమ, ప్రాధాన్యత చాటుకున్న విషయం అందరికీ తెలుసన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సంబంధిత వర్గాల వారంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలచి మరోమారు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. బీసీలకు కల్పించిన అవకాశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని సీఆర్‌కాలనీ, నెహ్రూనగర్, రజకకాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ, పొట్టి శ్రీరాములు వీధి, మండలంలోని కమ్మవారిపాలెం, మద్దిరాల, బొప్పూడి గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, నాయకులు సయ్యద్ బడే, సయ్యద్ సిరాజ్, షేక్ అబ్దుల్‌గని, మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్ పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా !

గడప గడపకు ప్రచారంలో కావటి



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు

నాదెండ్ల: ప్రజా సమస్యల్ని పరిష్కరిస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థి కావటి శివనాగమనోహర్‌నాయుడు చెప్పారు. మండలంలోని తూబాడు శివారు గ్రామమైన గున్నావారిపాలెం, రాజుగారిపాలెం, ఎండుగుంపాలెం గ్రామాల్లో శనివారం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. త్వరలో చిలకలూరిపేటలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతిరోజూ చిలకలూరిపేట నియోజకవర్గంలో ఓ గ్రామంలో పర్యటించి, ప్రతి గడపను సందర్శించనున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు అమలు కావాలంటే మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గున్నావారిపాలెం గ్రామంలో రామాలయం వద్ద కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాయకులు బొల్లెద్దు చిన్నా, దాట్ల విక్రమరాజు, పత్తి వెంకట్, సింగారెడ్డి కోటిరెడ్డి, కోటేశ్వరరావు, ఆంజనేయులు, కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలూరిపేట: యువత భగత్‌సింగ్ ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ పోరాడితే నేడు మోదీ ప్రభుత్వం వారినే ఆహ్వానించి దేశసంపదను కట్టబెడుతోందని విమర్శించారు. రోజురోజుకు మతపరమైన దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తాళ్లూరి బాబూరావు, పేలూరి రామారావు, చెరుకుపల్లి నిర్మల, నాయుడు శివకుమార్ పాల్గొన్నారు.

- ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్ సింగ్ వర్ధంతిలో సంఘ అధ్యక్షుడు బి. శ్రీనునాయక్, బి. చిన్నానాయక్, కొండ్రముట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పాడపాడులో పోలీసు కవాతు



పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని పాడపాడు గ్రామంలో ఎస్ఐ విప్పర్ల వెంకట్రావు ఆధ్వర్యంలో బార్డర్ సెక్యూరిటీ ఫోర్సుతో శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఎక్కడైనా సమస్యలు వస్తే పోలీసులకు తెలియపరచాలని కోరారు.

జాతీయ జెండా దిమ్మెకు పచ్చ రంగు

- టీడీపీ నాయకుల దురంహకారం
- అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వార్డులో దిమ్మెకు వేసిన పచ్చరంగు

నరసరావుపేట: టీడీపీ నాయకుల దురంహకారాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకున్న సంఘటన పట్టణంలోని తొమ్మిదో ఎస్టీ వార్డు శ్రీనివాసనగర్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక టీడీపీ నాయకులు కట్టా గురవయ్య, రమేష్ జాతీయ జెండా దిమ్మెకు తమ పార్టీ రంగులు వేసి ఆవిష్కరించేందుకు ఏర్పాట్లకు పూనుకున్నారు. ఇది గమనించిన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ చర్యను అడ్డుకున్నారు. వేసిన పచ్చరంగుపై మళ్లీ తెలుపు రంగు వేశారు. జాతీయ జెండా దిమ్మెకు టీడీపీ రంగులు మానుకోవాలని, వేరే స్థలంలో దిమ్మెను నిర్మించుకోవాలని సూచించారు. దీంతో అక్కడి నుంచి వారు నిష్క్రమించారు. దీనిపై గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రశాంతమైన ఎస్టీ కాలనీలో పార్టీల పేరుతో సమస్యలు సృష్టించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ వార్డులోని ఎస్టీలంతా దేశభక్తితో జాతీయ జెండాను ఏర్పాటు చేసుకున్నారని, దానిపై పార్టీ రంగులు వేయడం మంచిది కాదని హెచ్చరించారు.

ఎన్నికల కోడ్ పాటించడం తప్పనిసరి

నాదెండ్ల: ప్రభుత్వం నుంచి వేతనం తీసుకునే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల కోడ్ పాటించాలని తహసీల్దార్, ఏఈఆర్‌వో డీవీబీ వరకుమార్ చెప్పారు. తన కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఏలు, రేషన్ డిపో డీలర్లు, ఎండీఎం ట్రక్ ఆపరేటర్లకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లు కూడా రాజకీయ పార్టీల సమావేశాలు, నేతలతో కలసి ప్రచారాల్లో పాల్గొనకూడదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో ఎన్నికల నియమావళి సక్రమంగా అమలయ్యేట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఫ్లెక్సీలు, జెండాలు, శిలాఫలకాలు, స్టిక్కర్ల తొలగింపు, రాజకీయనేతల విగ్రహాలకు ముసుగులు వేసినట్లు చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటుశాతం పెంచేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. మొదటిసారిగా ఎన్నికల కమిషన్ 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటు వేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ముందుగానే వీరంతా బీఎల్‌వోల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ రమీజా పాల్గొన్నారు.

మరో చాన్స్ ఇస్తే నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా !



వార్డులో కార్యకర్తలతో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

పట్టణంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రచారం

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని రెండో వార్డులో ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వినుకొండ నియోజకవర్గ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు ప్రజలు హారతులు ఇచ్చి అపూర్వ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో 600 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయారన్నారు. టీడీపీ పాలన అంటే గారడి అని విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక దేశంలో పార్టీలన్నీ ఒక్కటయ్యాయన్నారు. చంద్రబాబు, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎంతోపాటు, ఇటీవల లోక్ సత్తా పార్టీని కూడా కలుపుకుని అనైతిక పొత్తుకు తెరలేపారని దుయ్యబట్టారు. ఎంత మంది గుంపుగా వచ్చినా ప్రజా తీర్పుకు కొట్టుకుపోతారని తెలిపారు. వినుకొండలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తాను చేసిన అభివృద్ధి పనుల్ని ప్రజలు గుర్తించి, ఎంపీ అభ్యర్థిగా అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేగా తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. వినుకొండలో 2019 నుంచి అభివృద్ధి ఎలా ఉందో ఒక్కసారి గమనించాలని సూచించారు. పట్టణంలో తాగునీటి సమస్య పూర్తి పరిష్కారంతోపాటు, వంద పడకల ఆసుపత్రి మంజూరు, ట్రామా కేర్ సెంటర్, ఎన్ఎస్‌పీ కాల్వల అభివృద్ధి, రామలింగేశ్వర స్వామి ఘాట్‌రోడ్డుతోపాటు, పలు అభివృద్ధి పనులు చేసి చూపించామని చెప్పారు. మరో అవకాశం ఇస్తే వినుకొండను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని, వీధికొక రౌడీ తయారవుతాడన్నారు. వాస్తవాలను గమనించి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన చాట్రగడ్డపాడు గ్రామస్తులతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఎమ్మెల్యే బొల్లా సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరికలు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినుకొండ రూరల్ మండలం చాట్రగడ్డపాడు గ్రామానికి చెందిన 10 కుటుంబాలు, బొల్లాపల్లి మండలం గంగుపల్లి గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో శనివారం వైఎస్సార్ సీపీలోకి చేరాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూసి అనేక మంది పార్టీలో చేరుతున్నారని, రానున్న రోజుల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గంగుపల్లి వాసులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

సకాలంలో సస్యరక్షణతో అధిక దిగుబడులు



విప్పర్లలో రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం రూరల్ అవేర్‌నెస్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాంను నిర్వహించారు. పల్నాడు జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్, వరప్రసాద్ నేతృత్వంలో గ్రామంలోని రైతులకు వ్యవసాయంపై అవగాహన, మెలుకువలపై అవగాహన కల్పించారు. సాగు చేస్తున్న పైర్లు, వాటికి ఆశించే చీడపీడల నివారణ, అధిక దిగుబడులు కోసం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై సూచనలు, సలహాలు అందజేశారు. శివాలయ ప్రాంగణంలో గ్రామ పటం, సమస్యల వృక్షం, వృత్త వలయం, పలు రకాల వంగడాలు, వాటి దిగుబడులు, ధరలు, విశ్లేషణ తదితర అంశాలపై రంగులతో చిత్రాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థినులు పి.రాజి, ఎం. సౌమ్య, బి.వేదశ్రీ విద్య, ఏ. వాగ్దేవి, ఎస్. ఊర్మిళతో పాటు స్థానిక రైతు భరోసా కేంద్రం చైర్మన్ సానికొమ్ము రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల సజావుగా జరిగేలా సహకరించాలి



శావల్యాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకర్

శావల్యాపురం: రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలంతా సహకరించాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ కోరారు. మండలంలోని కొత్తలూరు, శావల్యాపురం గ్రామాల్లో శనివారం కేంద్ర పోలీసు బలగాల సారథ్యంలో పోలీసు కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపుతో పాటు తిరునాళ్లను కూడా నిషేధించినట్లు తెలిపారు. గ్రామాల్లో గొడవలు, అల్లర్లు సృష్టించే వారిపై ఎన్నికల పూర్తయ్యే వరకు నిఘా ఉంటుందని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు కూడా సంయమనం పాటించి ఎన్నికల సజావుగా జరిగేలా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం గ్రామ పురవీధుల్లో సిబ్బంది కవాతు నిర్వహించారు. కేంద్ర బలగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీనా, ఎస్ఐ చల్లా సురేష్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సతో క్షయ వ్యాధి పూర్తిగా నయం



గణపవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాద్ నాయక్, వైద్య సిబ్బంది

నాదెండ్ల: క్రమం తప్పకుండా వైద్యం, పౌష్టికాహారం తీసుకుంటే క్షయవ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చని వైద్యాధికారి ఎల్. ప్రసాద్‌నాయక్ చెప్పారు. గణపవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఆదివారం నుంచి క్షయవ్యాధి మాసోత్సవాల సందర్భంగా శనివారం పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని బొడ్డురాయిసెంటర్ వరకూ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు క్షయ వ్యాధి ప్రాణాంతకమైనదని, ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన మందులు లభిస్తున్నాయని తెలిపారు. రోగి ఇంటి వద్దకే వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా వచ్చి మందులు అందిస్తారన్నారు. మంచి పౌష్టికాహారం, సరైన వైద్యంతో క్షయవ్యాధి తగ్గిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాసరయ్య, జానకీదేవి, రహమాన్‌బాషా, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.